క్లుప్తంగా

నేడు కొత్త శానంబట్లలో పశువుల పందేలు

చంద్రగిరి : నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా బుధవారం కొత్తశానంబట్లలో పశువుల పందేలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మొదలయ్యే పందేలకు భారీ సంఖ్యలో జనం రానున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. ఈ మేరకు వాటర్ బాటిళ్లు, అంబలి, భోజనాలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

సమాచార పత్రిక విడుదల



పత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు, వైద్యులు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల, సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో సమాచార పత్రిక రెండో ఎడిషన్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పేద రోగులకు అందిస్తున్న వైద్యం, పరిశోధనలపై మూడు నెలలుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే వైద్య, పారామెడికల్, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే సమాచారంతో 3నెలలకు ఒకసారి పత్రికను విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు అవసరం



నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : విద్యార్థుల్లోని శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అవసరమని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన పరిశీలించారు. మెరుగైన ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ ప్రాజెక్టులను ఈ నెల 3వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపుతున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు ధర్మేంద్ర, భాగ్యలక్ష్మి, ఈశ్వర్‌ప్రసాద్, యుగంధర్‌రెడ్డి, ఏకాంబరం, మాధవి పాల్గొన్నారు.

యుటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

చంద్రగిరి : యుటీఎఫ్‌కు సంబంధించి నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో ఎంఈఓలు లలితకుమారి, భాస్కర్ బాబు, సర్వ శిక్ష అభియాన్ ఏఎస్‌ఓ సారథి చేతుల మీదుగా విడుదల చేశారు.

అమ్మవారి సేవలో తమిళనాడు మంత్రి



ఆలయం వెలుపల మంత్రి గాంధీ

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని తమిళనాడు మంత్రి ఆర్.గాంధీ మంగళవారం సేవించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పింక్ బస్సులతో క్యాన్సర్ స్క్రీనింగ్



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

చంద్రగిరి : స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా ఉచితం క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు కొటాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఎ.రంగంపేట సచివాలయం వద్ద పలువురికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో రెండు పింక్ బస్సులు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. పెద్దసంఖ్యలో మహిళలు, పురుషులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు వివరించారు. సర్పంచ్ ఎర్రయ్య, డీపీఓ సుశీలాదేవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్లు పద్మావతి, చైతన్యభాను పాల్గొన్నారు.

సుమం







తిరునగరం న్యూ ఇయర్ జోష్‌ను సంతరించుకుంది. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకునేందుకు ప్రజానీకం పోటీపడుతోంది. స్వీట్లు.. పండ్లతోపాటు ఫ్లవర్ బొకేలకు సైతం డిమాండ్ ఏర్పడింది. కొనుగోలుదారుల ఆలోచనలకు అనుగుణంగా విభిన్న రకాల పుష్పగుచ్ఛాలు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. సుమనోహర సుమాల నడుమ రాజకీయ నేతల చిత్రపటాలు కొలువుదీరి అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

శోభితం



నూతన సంవత్సరం.. వైకుంఠ ఏకాదశికి తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు స్వాగతం పలుకుతోంది. రాబోయే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతోంది. విద్యుద్దీపాల కటౌట్లతో అలరారుతోంది. పుష్పశోభితంగా విరాజిల్లుతోంది. - తిరుపతి రూరల్

డ్రైవింగ్ లైసెన్స్ కావాలి.. మొదట ఎల్‌ఎల్‌ఆర్ తీసుకున్నారు.. ఏదో డ్రైవింగ్ స్కూల్‌లో చేరి కొన్ని రోజులు నేర్చుకున్నారు.. టెస్ట్‌లో పాసయ్యేంత నైపుణ్యం లేకున్నా ఎవరో ఒక దళారీని పట్టుకుని లైసెన్స్ సంపాదించేశారు. ఇదంతా బాగానే ఉంది. మరి వచ్చీరాని డ్రైవింగ్‌తో బండి వేసుకుని రోడ్డెక్కితే? ఏదైనా ప్రమాదానికి కారణమైతే? ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తిరుపతిలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. నిర్ణీత ప్రమాణాల మేరకు వాహనం నడిపితేనే లైసెన్స్ జారీ చేయనుంది.

డ్రైవింగ్ ట్రాక్‌లో ఏర్పాటు చేసిన సెన్సార్, (ఇన్‌సెట్) రవాణాశాఖ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్





అందుబాటులోకి

ఆధునిక ట్రాక్

- డ్రైవింగ్ టెస్ట్‌కు ఆటోమేటిక్ సెన్సార్
- కంప్యూటర్‌లో పరీక్ష సమాచారం
- ప్రమాణాల మేరకు వాహనం నడిపితేనే లైసెన్స్

తిరుపతి మంగళం : డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వచ్చే వారికి రవాణాశాఖ తనిఖీ అధికారులే పరీక్ష నిర్వహించి లైసెన్స్ జారీ చేసే పద్ధతి చాలాకాలం నుంచి కొనసాగుతోంది. మాన్యువల్‌గా సాగుతున్న ఈ విధానానికి స్వస్తి చెప్పేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆధునీకరణకు చర్యలు చేపట్టారు. ఆటోమెటిక్ పద్ధతిలో ట్రాక్‌ల నిర్వహణ చేపట్టేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. బుధవారం నుంచి ఆటోమేటిక్ సెన్సార్‌తో వాహనదారులకు టెస్ట్ చేపట్టనున్నారు. ఈక్రమంలో ప్రమాణాల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ లభించనుంది. టెస్ట్‌కు వచ్చేవారు బాగా శిక్షణ తీసుకుని డ్రైవింగ్‌లో నైపుణ్యం సంపాదించాలని జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ (డీటీఓ) స్పష్టం చేశారు.

పెరిగిన వాహనాలు

ప్రస్తుతం చాలా మందికి బైక్ లేదా కారు నిత్యావసరంగా మారింది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు అన్ని వర్గాల వారు వ్యక్తిగత వాహనాలను వినియోగిస్తున్నారు. ఏటా వేలాది మంది కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుని వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. రవాణా రంగంలో డ్రైవర్లుగా చేరుతున్నారు. అయితే చాలా మంది ఎలాంటి డ్రైవింగ్ టెస్టు లేకుండా లైసెన్స్ వచ్చేస్తే బాగుంటుందని బావిస్తుంటారు. ఇందుకోసం ఏజెంట్లను, మధ్యవర్తులను ఆశ్రయిస్తుంటారు. సరిగా నేర్చుకోకుండా, టెస్ట్‌కు హాజరుకాకుండా తప్పుడు పద్ధతుల్లో లైసెన్స్ పొందితే అరకొర అనుభవంతో బండి నడిపితే ప్రమాదాల బారినపడే అవకాశముంటుంది.

వందలాది మందికి టెస్ట్‌లు

జిల్లా వ్యాప్తంగా నిత్యం వందలాది మందికి డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వాహనదారులు డ్రైవింగ్‌పై బాగా పట్టు సాధించిన తర్వాతే టెస్ట్‌కు హాజరుకావాలి. అప్పుడే ఫెయిల్ కాకుండా బండి నడపగలరు. తిరుపతి రవాణాశాఖ కార్యాలయంలోని డ్రైవింగ్ ట్రాక్‌లో సెన్సార్ ఏర్పాటు చేశాం. వాహనదారులు చేసే డ్రైవింగ్‌లో చిన్నపాటి లోపం ఉన్నా సెన్సార్ వెంటనే ఫెయిల్ చేస్తుంది. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తుపెట్టుకోవాలి.



– మురళీమోహన్, డీటీఓ

మంగమ్మ సేవలు మరువలేం



మంగమ్మను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

తిరుపతి ఎడ్యుకేషన్ : కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నగరపాలక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తూ విద్యారంగానికి మంగమ్మ చేసిన సేవలు మరువలేమని ఉపాధ్యాయ సంఘాల నేతలు కొనియాడారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన మంగమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతలు బండి మధుసూదన్‌రెడ్డి, వరలక్ష్మి, ఎస్‌కే బాషా, కృష్ణకుమార్, మారుతీ దేవి, భాస్కర్, గోపాల్, కవిత, వెంకటముని, నేమిలేటి కిట్టన్న, వెంకటాద్రి, భారతి, రాధా మదన, తేజోవతి, రమణ పాల్గొన్నారు.

వంద మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

తిరుపతి కల్చరల్ : అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడు శంకర్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం వంద మంది రక్తదానం చేశారు. కపిల తీర్థం రోడ్డులోని సంఘ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. రుయా బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ హరిత పర్యవేక్షణలో సిబ్బంది మంజుల, టెక్నీషియన్ రఘురాం చౌదరి, శ్రీకాంత్, అవినాష్, సాయి, శ్రీను, చైతన్య, నితీష్ తదితరులు యువత నుంచి రక్తం సేకరించారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: మండలంలోని సి.కాలేపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు పరిశీలించారు. మంగళవారం ఈ మేరకు పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రవణప్ప వితరణగా అందించిన ఇంగ్లిష్ డిక్షనరీ, కథల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం న్యూ ఇయర్ కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, జగన్నాథం, సిద్ధముని రెడ్డి పాల్గొన్నారు.

'ముక్కోటి'కి ముమ్మర ఏర్పాట్లు

తిరుపతి సిటీ : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ స్థానిక ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేయిస్తున్నారు. రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.

'మలబార్'లో డైమండ్ ఫెస్టివల్



ప్రదర్శనను ప్రారంభిస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన మైన్ డైమండ్ ఫెస్టివల్‌ను మంగళవారం కస్టమర్లు ప్రారంభించారు. షోరూమ్ హెడ్ రెజీష్ మాట్లాడుతూ మైన్ డైమండ్ ఫెస్టివల్‌లో సాలిటైర్, పార్టీ వేర్, క్యాజువల్, బ్రైడల్ ఆభరణాలు, స్టేట్‌మెంట్ నెక్లెస్‌లతో పాటు అద్భుతమైన చెవిపోగులు, సున్నితమైన స్టడ్స్, రింగ్స్, విభిన్న శ్రేణి డైమండ్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జనవరి 14 తేదీ వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో మైన్ డైమండ్ ఆభరణాల మార్పిడిపై వంద శాతం విలువను పొందవచ్చని వివరించారు. కొత్తగా కొనుగోలు చేసే డైమండ్ విలువపై 25 శాతం వరకు తగ్గింపు ఉంటుందని తెలిపారు.

ముగిసిన స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ

రామచంద్రాపురం: మండలంలోని మెడ్జీ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 6వ విడత స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ మంగళవారంతో ముగిసింది. డీవైఈఓ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 350 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ అందించినట్లు చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని కోరారు. అనంతరం టీచర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఏఎంఓ మధు, ఐఈ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, కోర్సు డైరెక్టర్ మధు, డైట్ లెక్చరర్ దేవ ప్రకాశం పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందిస్తున్న డీవైఈఓ ప్రభాకర్ రాజు

కేంద్రమంత్రికి ఘన స్వాగతం

తిరుపతి కల్చరల్ : కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు మంగళవారం రేణిగుంట ఎయిర్‌పోర్టులో కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



గజేంద్రషెకావత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీసీ రాయులు

అధ్వాన్నం



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు.. ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరు ప్రఖ్యాతులు.. స్మార్ట్‌సిటీ కింద వెల్లువెత్తిన నిధులు.. అయినప్పటికీ తిరునగరంలో చెత్తకుప్పలు దర్శనమిస్తూనే ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణలోపం కారణంగా తిరుపతిని వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ప్రధానంగా లీలామహల్ కూడలి నుంచి దేవేంద్ర థియేటర్ మార్గంలో స్కావెంజర్స్ కాలనీ వద్ద నిత్యం చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. - తిరుపతి తుడా

ఆవేదన







ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ మీదే అధిక సంఖ్యలో అవ్వాతాతలు ఆధారపడి ఉంటారు. తమ అవసరాలకు ఎవరి వద్దా చేయిచాపకుండా వినియోగించుకుని ఆనందపడుతుంటారు. అయితే కూటమి సర్కార్ కొలువుదీరిన తర్వాత పండుటాకులకు పడిగాపులు తప్పడం లేదు. మంగళవారం ఈ క్రమంలోనే వృద్ధులు.. దివ్యాంగులు తమ ఇళ్ల ముందు పెన్షన్ కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. ఎమ్మెల్యే.. కమిషనర్.. సకాలంలో రాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నేతలు వస్తేనే సొమ్ము ఇస్తామని సచివాలయ సిబ్బంది స్పష్టం చేయడంతో దిక్కుతోచని స్థితి దాపురించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



ప్రజా సేవే లక్ష్యం


మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం : ప్రజా సేవే లక్ష్యంగా చిత్త శుద్ధితో పనిచేస్తున్నామని మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది జనం జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

బరితెగింపు!

- స్వర్ణముఖిని తోడేస్తున్న ఇసుకాసురులు
- ప్రశ్నించిన వారిపై యథేచ్ఛగా దాడులు
- అక్రమార్కులకు అండగా ప్రజాప్రతినిధులు
- స్పందించని అధికారులు



రెడ్డివారిపల్లి వద్ద ఇసుక డంప్, (ఇన్‌సెట్) ఇసుకాసురుల ఆగడాల నుంచి కాపాడాలంటూ వేడుకుంటున్న స్థానిక మహిళ

చంద్రగిరి : కూటమి నేతలు ప్రకృతి వనరులను కొల్లగొట్టేస్తున్నారు. రూ.కోట్ల సంపాదనకు బరితెగించేస్తున్నారు. రాత్రి వేళల్లో జేసీబీల సాయంతో అక్రమంగా ఇసుకను తోడేస్తూ, టిప్పర్లు, లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. వారి ఆగడాలను ప్రశ్నించిన స్థానికులపై దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల రెడ్డివారిపల్లి పంచాయతీలో ఇసుకాసురులు గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగారు. స్వర్ణముఖి నదిలో ఇసుకను జేసీబీల సాయంతో తవ్వుకుని డంపింగ్ చేసుకోవడమే కాకుండా స్థానికులను తీవ్రంగా వేధిస్తున్నారు. డంపింగ్ వద్ద కూటమి నేతల అనుచరులు విచ్చలవిడిగా మద్యం తాగుతున్నారు. మద్యం సీసాలను సమీపంలోని పొలాల్లోకి విసిరేస్తున్నారు. ఆ గాజు పెంకుల కారణంగా పశువులు గాయాలపాలవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నిస్తే తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మండపడుతున్నారు.

పట్టించుకోని పోలీసు, రెవెన్యూ సిబ్బంది

కొద్దిరోజులుగా టిప్పర్లు, లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ఇసుకను ఇంటి నిర్మాణ అవసరాల కోసం వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, అయితే ఇక్కడ మాత్రం అక్రమ రవాణాకు వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో టీడీపీ నేతల నిరసన

గతంలో రెడ్డివారిపల్లి, రామిరెడ్డిపల్లి ప్రాంతంలో అక్రమంగా ఇసుక రవాణా సాగుతోందంటూ అప్పటి ప్రతిపక్ష పార్టీ నేతలు, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు నిరసనకు దిగి ఆందోళన చేసినట్లు గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అయితే నిరసనకు దిగిన వారే ప్రస్తుతం ఇసుక స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


ఆటోనగర్‌లో చెత్తాచెదారాలను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో దుకాణదారులు తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆటోనగర్, జీవకోన ప్రాంతాలను పరిశీలించారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు, టైర్లు పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏరియా నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నా ఏపీఐఐసీకి చెందినదన్నారు. యూజర్ చార్జీలు చెల్లిస్తే పారిశుద్ధ్య పనులు చేపడతామని వెల్లడించారు. అపరిశుభ్రతతో ఆటోనగర్ వాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, డీఈ రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, బాలాజీ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు


డ్రంక్ అండ్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : నగరంలో పోలీసులు మంగళవారం రాత్రి పకడ్బందీగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో పోలీసు బృందాలు పలువురు వాహనదారులను టెస్ట్ చేశాయి. మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నాయి.

సంతాప దినాల అమలు

తిరుపతి అర్బన్ : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పరమపదించిన నేపథ్యంలో ప్రభుత్వం జనవరి 1వ తేదీ వరకు సంతాప దినాలు ప్రకటించిన క్రమంలో కలెక్టరేట్‌కు బొకేలతో ఎవరూ రావద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. అధికారులు, నేతలు ఎవరూ తమను ఫ్లవర్ బొకేలు, కేక్‌తో కలిసేందుకు రాకూడదని సూచించారు.

శాంతిభద్రతల రక్షణే లక్ష్యం


సంజీవరాయుడు, ఎస్ఐ

పాకాల : శాంతి భద్రతల రక్షణే లక్ష్యమని ఎస్ఐ ఎంఎస్ సంజీవరాయుడు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పాకాల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : బైరాగిపట్టెడలోని రెడ్డి సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నేతలు దండు ధర్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జీజీ రెడ్డి, ప్రైవేటు స్కూళ్ల అధినేతలు రెడ్డివారి శ్రీధర్‌రెడ్డి, ఓంప్రకాష్‌రెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి, బీసీ నేత రెడ్డెప్ప పాల్గొన్నారు.

వర్సిటీలో అదనపు 'నిఘా'


సీసీ కెమెరాలు అమర్చుతున్న ఫారెస్ట్ సిబ్బంది

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిసరాల్లో ఫారెస్ట్ అధికారులు అదనపు నిఘా కెమెరాలను అమర్చారు. మంగళవారం ఈ మేరకు వర్సిటీ ఆవరణలోని పలు ప్రాంతాల్లో 10 కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుత సంచారంపై కలకలం రేగిన నేపథ్యంలోనే కదలికలు గుర్తించేందుకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అభ్యర్థన మేరకు అనుమానిత ప్రదేశాల్లో కెమెరాలు అమర్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే విద్యార్థులు, ఉద్యోగులు రాత్రి 8 నుంచి ఉదయం 6గంటల వరకు వర్సిటీ పరిసరాల్లో సంచరించకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

స్కేటింగ్‌లో 'అట్లాంటిస్' ప్రతిభ


విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుపతి గాంధీ రోడ్ : కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల విద్యార్థులు స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో రెండో తరగతి విద్యార్థి చరణ్‌తేజరెడ్డి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించాడు. అలాగే రిలే రేస్‌లో రజతం దక్కించుకున్నాడు.అలాగే నాలుగో తరగతి విద్యార్థిని డి.కీర్తన 200, 400,1000 మీటర్ల స్కేటింగ్ రేస్‌లో బంగారు పతకాలు సాధించింది. అలాగే రిలే రేస్‌లో రజత పతకం అందుకుంది. ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. పిల్లలను పాఠశాల అధినేత కేఎస్ వాసు అభినందించారు.

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులతో వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : చెన్నై ఎస్ఆర్ఎమ్ వర్సిటీలో మూడు రోజులుగా నిర్వహించిన సౌత్‌జోన్ సాంస్కృతిక పోటీలలో పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు సత్తాచాటారు. లిటరరీ, థియేటర్ విభాగాలలో ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. ఫోక్ డ్యాన్స్, డిబేట్‌లో 4వస్థానం, కల్చరల్ ర్యాలీ, గ్రూప్ సాంగ్ లో 5వ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, కల్చరల్ కో–ఆర్డినేటర్ శైలేశ్వరిని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు.



వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు వేగవంతం

తిరుపతి సిటీ: వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా తిరుపతిలో జారీ చేయనున్న సర్వదర్శనం టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్యూలైన్లు, బారికేడ్లు, షెడ్లు, భద్రత, తాగు నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ ద్వారా దర్శనం కోసం తిరుపతి, తిరుమలలో ఈనెల 10, 11, 12 తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5గంట నుంచి 1.2 లక్షల టోకెన్లు జారీ చేయనున్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు జారీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.


టోకన్ల జారీ కేంద్రాల వద్ద జోరుగా సాగుతున్న ఏర్పాట్లు

'విశ్వం'లో న్యూ ఇయర్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్ : వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో మంగళవారం రాత్రి ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ సీఎంపీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ విశ్వం విద్యాసంస్థల యాజమాన్యం గత మూడు దశాబ్దాలుగా సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తూ విద్యార్థుల ఉన్నతికి తోడ్పాడుతోందని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ విశ్వ చందన్‌రెడ్డి, ఆపుస్మా నేతలు రవీంద్రారెడ్డి, భాస్కరరాజు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా శ్రమించాలి


విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఒడిశా స్పీకర్ సురమా పాది, అతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థులు విజయమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించాలని ఒడిశా రాష్ట్ర స్పీకర్ డాక్టర్ సురమా పాది పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ సంస్కృత వర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ సంస్కృత విద్యార్థుల క్రీడా మహోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు దేశ వికాసానికి ప్రతీకలని, సంస్కృత వర్సిటీలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. జాతీయ సంస్కృత క్రీడా పోటీల్లో వర్సిటీ 15 గోల్డ్ మెడళ్లు, 3 సిల్వర్ మెడళ్లతో చాంపియన్‌గా నిలవడం గర్వకారణమని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ అందజేశారు. శ్యాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ రమాశ్రీ, అకడమిక్ డీన్లు రజనీకాంత్ శుక్ల, ఎస్.దక్షిణమూర్తిశర్మ, క్రీడాసమితి అధ్యక్షుడు సతీష్, పీడీ సేతూరామ్, సీ.రంగనాథన్ పాల్గొన్నారు.

కులగణన పేరుతో దగా


మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

తిరుపతి కల్చరల్ : కులగణన పేరుతో మాలలను ప్రభుత్వం దగా చేస్తోందని, వర్గీకరణ అంటూ సర్వేలతో కుట్ర చేస్తోందని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరితంగా వ్యవహరిస్తూ మాల, మాదిగల జనాభా నిష్పత్తిని మార్పు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాలల జనాభా నిష్పత్తిని తేల్చాల్సింది సెన్సెస్ ఆఫ్ ఇండియా అని, అయితే రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా లెక్కింపు చేపట్టిందని మండిపడ్డారు. మాలల్లో నాలుగు కేటగిరీలను క్రిస్టియన్లుగా చూపించి, మాదిగలకు ఎక్కువ రిజర్వేషన్లు కల్పించేందుకు చంద్రబాబు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నేతలు మల్లారపు మధు, అజయ్‌కుమార్, పి.ప్రభాకర్, గిరి, కొండలరావు, రమణ పాల్గొన్నారు.

రెండేళ్లపాటు పాఠశాల వసతికి వినతి


వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ రేష్మా

తిరుపతి సిటీ: జూపార్క్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఎస్వీయూ భవనంలో మరో రెండేళ్లపాటు కొనసాగించుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రిన్సిపల్ రేష్మా విన్నవించారు. మంగళవారం ఈ మేరకు ఆమె పాఠశాల సిబ్బందితో కలసి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యంలో పాఠశాలకు స్థలం కేటాయించారన్నారు. అయితే నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ భవనంలో పాఠశాల నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు.

అవమానం


అహింస అనే ఆయుధంతో రవి అస్తమించని బ్రిటిష్ పాలకులను హడలెత్తించిన ధీరోదాత్తుడికి అడ్డుగా నిలబడింది. రాజకీయ నేతల ఆర్భాటం ముందు అలవి కాని ఆత్మాభిమానం చిన్నబోయింది. కూటమి నేతలు ఎమ్మార్‌పల్లె సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కారణంగా మహాత్ముని విగ్రహానికి అవమానం జరిగింది. - సాక్షి ఫోటోగ్రాఫర్ తిరుపతి

ఉద్యోగ విరమణ సత్కారం


బాలసుబ్రమణ్యం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల : స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం ఉద్యోగ విరమణ చేస్తున్నందున మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, విద్యార్థుల ఉన్నతికి తోడ్పడిన గొప్ప వ్యక్తి బాలసుబ్రమణ్యం అని కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి పాల్గొన్నారు.